క్లుప్తంగా

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేలకొండపల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు శత తారక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌వీ కృష్ణయాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో ఎవర్‌గ్రీన్ స్కూల్‌లో సోమవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. 6వ తరగతి నుంచి ఇంటర్, బీటెక్ విద్యార్థులు తరగతులకు హాజరు కావొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మనోజ్‌కుమార్, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

బహుజనులే గెలిపించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: ఎంసీపీ(యూ) బీఎల్పీ, పీఆర్‌పీఎస్, బీఎల్‌ఎఫ్ బలపర్చిన బహుజన కమ్యూనిస్ట్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి ఆంథోని సరేశ్‌ను గెలిపించాల్సిన బాధత బహుజనులదేనని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి పొదకంటి రాంబాబు అన్నారు. సోమవారం ఖమ్మంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోపిడీ కులాలు నిర్మించుకున్న పార్టీలకు బానిసలై, అజ్ఞానంతో బతుకుతూ వారి కాళ్ల దగ్గర జాతిని తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కర్నె రామారావు, లింగన్నబోయిన లక్ష్మణ్, పీఆర్ దేవి, వెంకయ్య, విజయ్‌కుమార్, శ్రీను, దానేలు తదితరులు పాల్గొన్నారు.

మృతికి సంతాపం

ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలోని 25వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకురాలు కోడి కోటమ్మ మృతికి ఆ డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నర్సింహారావు సంతాపం తెలిపారు. సోమవారం ఎస్సీకాలనీలోని ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. దాసరి పూర్ణ, నాగభూషణం, పి.నరేశ్, గురుమూర్తి, బొడ్డు మధు, కోడి శైలజ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయలైన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ మండలం మంగళగూడెం గ్రామానికి చెందిన నడిగూడెం ఉపేందర్ తన ద్విచక్రవాహనంపై లింగాల క్రాస్ రోడ్డు నుంచి తాళ్లగూడెం వైపు వెళ్తుండగా పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కింద పడ్డాడు. తలకు గాయమైన ఉపేందర్‌ను 108 ద్వారా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తిరుమలాయపాలెం మండలంలో..

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి స్టేజీ సమీపాన తిరుమల కోల్డ్ స్టోరేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎదుళ్లచెరువుకు చెందిన అజ్మీరా రమేశ్ ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం రాత్రి ఖమ్మం నుంచి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు స్క్వేర్
సాయిరాం	గాడ్జిల్లా
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్
సుందర్	---------------

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	5
వంకాయ	20		10
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	50		10
కాకర	40	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	46	తోటకూర	2
దొండ	36		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	80		10
గోరుచిక్కుడు	30	మెంతికూర	3
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	40		20
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

వంతెన.. ఇక అంతేనా?

- నిధులు ఉన్నా నిర్మాణంలో జాప్యం
- చింతగుర్తి – సూర్యతండా వంతెన నిర్మాణానికి రూ.2.85 కోట్లు
- ఆరునెలల కిందట శంకుస్థాపన కూడా..
- ఇప్పటికీ మొదలుకాని పనులు


చింతగుర్తి - సూర్యతండా రోడ్డులో ఉన్న చప్టా

రఘునాథపాలెం: అక్కడ వంతెన లేకపోతే రాకపోకలకు నానా ఇబ్బందులు పడాలి వస్తుంది. లోలెవెల్ చప్టా కారణంగా చిన్నపాటి వర్షానికే నీరు చేరి రైతులు, వాహనదారులు అవస్థ పడుతున్నారు. ఇలా ఏళ్లుగా ప్రజలు పడుతున్న కష్టాలను చూసి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.2.85 కోట్ల నిధులు కేటాయించింది. కానీ కళ్ల ముందు నిధులు కనిపిస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు మొదలు కాకపోవడంతో ప్రజల కష్టాలకు పరిష్కారం కానరావడం లేదు.

శంకుస్థాపన కూడా..

రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి నుంచి సూర్యతండా వెళ్లే రహదారిలో లోలెవెల్ చప్టా ఉంది. దీంతో రాకపోకలకు సమస్యలు ఎదురవుతుండగా.. వర్షాకాలంలో ఆ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. ఈ నేపథ్యాన ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో కేంద్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించింది. ఈ నిర్మాణానికి గత ఏడాది సెప్టెంబర్ 28న శంకుస్థాపన సైతం చేశారు. కానీ, ఇప్పటివరకు పనులు మొదలు కాలేదు. ఎండాకాలం నాటికి పనులు పూర్తవుతాయని.. వచ్చే వర్షాకాలంలో సమస్యలు ఉండవని స్థానికులు భావించగా ఆ పరిస్థితి కానరావడం లేదు.

శిథిలావస్థలో చప్టా

చింతగుర్తి - సూర్యతండా మార్గంలోని చప్టా ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మామూలు సమయంలోనే అవస్థ పడుతుండగా.. వర్షాకాలం వస్తే ఇక్కట్లు మరింత పెరుగుతున్నాయి. నిత్యం ఈ రహదారిపై ప్రజలతో పాటు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులతో వెళ్లి వస్తారు. ఈ మేరకు నిధులు లేక ఇన్నాళ్లు రహదారి నిర్మాణం జరగకపోగా.. ఇప్పుడు నిధులు ఉండి, శంకుస్థాపన చేసినా పనులు మొదలుకాకపోవడంతో స్థానికులు తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని ఎదురుచూస్తున్నారు. కాగా, మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ బ్రిడ్జి నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇదే మార్గంలో ఇటీవల రోడ్డు నిర్మించారు. అప్పుడు అదే కాంట్రాక్టర్‌కు బ్రిడ్జి పనులు సైతం అప్పగిస్తే ఏకకాలంలో రెండు పనులు పూర్తయ్యేవి. కానీ, అధికారులు ఆ దిశగా పట్టించుకోకపోవడంతో ప్రజల రవాణా బాధలు తీరే మార్గం కానరావడం లేదు. ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మాణం ప్రారంభించాలి



వంతెన నిర్మాణానికి నిధులు ఉన్నాయి. తక్షణమే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలి. ఇప్పుడు ఉన్న చప్టాపై వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. రైతులు, ప్రజల బాధలను అధికారులు, పాలకులు గుర్తించి వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలి.

–మెంటం రామారావు, మాజీ సర్పంచ్

కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతోనే..

మూడు ఖానాలతో వరద నీరు వెళ్లేలా పాత చప్టా స్థానంలో వంతెన నిర్మాణానికి పీఎం సడక్‌యోజన పథకంలో నిధులు మంజూరయ్యాయి. మూడు దఫాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మరోసారి టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

–ఆదిత్యరాజు, పీఆర్, ఏఈ

అసమానతలపై ఉద్యమించండి..

- లెనిన్ జయంతి కార్యక్రమాల్లో వక్తలు
- ఘనంగా సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం


ఖమ్మంమయూరిసెంటర్: అరుణ పతాకం ఎగురవేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విప్లవ కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడి 55 ఏళ్లు నిండుతున్నాయని, దాని స్ఫూర్తితో దేశంలో ఉన్న అసమానతలపై ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం లెనిన్ జయంతి, సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావం సందర్భంగా ఖమ్మం ఎన్‌ఎస్పీ క్యాంపులోని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో అరుణ పతాకం ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంటరీ పంథాను తిరస్కరిస్తూ 1969లో నయారివిజినిజంతో తెగదెంపులు చేసుకొని ఎంఎల్ పార్టీ లెనిన్ జయంతి రోజున ఆవిర్భవించిందని వెల్లడించారు. పదేండ్ల మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు రుణమాఫీ చేస్తూ ప్రజలపై పన్నుల భారం, అధిక ధరల భారం మోపిందన్నారు. నేడు జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి గెలుపొందడం కోసం మతోన్మాద బీజేపీ రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటోందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఎన్‌ఐఏ లాంటి సంస్థలను ఉద్యమకారులు, ప్రతిపక్ష నాయకులపై ప్రయోగించి అక్రమంగా అరెస్ట్ చేస్తోందని, ప్రజలపై, విప్లవోద్యమంపై దుర్మార్గమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని, ప్రజల వ్యక్తిగత మత విశ్వాసాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టి ఎలాగైనా ఎన్నికల్లో గెలుపొందాలనే కుటిల రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆవుల అశోక్, ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, కె.శ్రీను, మంగతాయి, శోభ, రాయల రవికుమార్, ఆజాద్ వెంకటేశ్, రాకేశ్, కొమరయ్య, సత్తార్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, వెంకన్న, భరత్, సురేశ్, తరుణ్ పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం

రఘునాథపాలెం: మతోన్మాదానికి వ్యతిరేకంగా లెనిన్ ఆశయాలకు అనుగుణంగా పోరాడుదామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం లెనిన్ 154వ జయంతి, సీపీఐ (ఎంఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రఘునాథపాలెం మండలంలోని రాంక్యతండా, వేపకుంట్ల గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగురవేశారు. కార్యక్రమంలో కేలోత్ పాపారావు, ధరావత్ లక్ష్మణ్, మేక రామనాథం, కూరాకుల నర్సయ్య, పొట్లపల్లి కృష్ణ, జాటోత్ ప్రేమ్‌సింగ్, కేలోత్ శివ, లచ్చు, ఇస్లావత్ రమేశ్, గుణగంటి వీరబాబు, మేక పిచ్చయ్య, పొట్లపల్లి సుందర్‌రావు, వంగూరి వెంకన్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

కామేపల్లి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ శక్తులైన బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఓడించాలని, కమ్యూనిస్టు, విప్లవకారులకు ఓట్లేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారయణ అన్నారు. సోమవారం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో లెనిన్ 154వ జయంతి సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా నాటి నుంచి నేటి వరకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రతిఘటన పోరాట సిద్ధాంత వెలుగులో అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో తూము పిచ్చయ్య, కోలా అప్పారావు, సిరిపురపు సూర్యం, కోలా దర్గయ్య, సుధాకర్, రవి, రఫీ పాల్గొన్నారు.

ఈర్లపుడిలో బొడ్రాయి, ముత్యాలమ్మ ప్రతిష్ఠ


రఘునాథపాలెం: అన్నదానం చేస్తున్న దృశ్యం


నేలకొండపల్లి: పూజలు చేస్తున్న దయాకర్‌రెడ్డి

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడిలో సోమవారం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజులుగా గ్రామంలో యాగశాల ఏర్పాటు చేసి పూజలు, విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరలిరావడంతో సందడిగా మారింది.

సుర్దేపల్లిలో నాగేంద్రస్వామి, పోతురాజు..

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లిలో శ్రీ గంగా రామలింగేశ్వర సమేత, నాగేంద్రస్వామి, పోతురాజుల ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా సాగింది. అర్చకుల వేద మంత్రోచ్ఛరణ మధ్య అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇంకా కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, సీతారాములు, మైశా శంకర్, గరిడేపల్లి రామారావు, కె.హన్మంతరావు, బండారుపల్లి వెంకటేశ్వరరావు, వి.సోమయ్య, పి.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పి.రవి, సుల్తాన్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా..


పార్టీలో చేరిన వారితో మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: అభివృద్ధిలో రఘునాథపాలెం మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రఘునాథపాలెంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, తాతా రఘురాం, మల్లీదు జగన్, గుత్తా వెంకటేశ్వరరావు, దిలీప్‌చౌదరి, గుడిపూడి రామారావు, మారం కరుణాకర్‌రెడ్డి, భూక్యా లాలు, బోయినపల్లి లక్ష్మణ్‌గౌడ్, బోయిన వెంకటనర్సయ్య, రెంటాల ప్రసాద్, నంద్యా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదు..


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి: ఖమ్మంలో బీజేపీ గెలుపును ఏశక్తీ అడ్డుకోలేదని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని, పదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. బీఆర్‌ఎస్ బోర్డు తిప్పేసిందని, ఆ పార్టీ పని అయిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరినవారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కనగాల వెంకటరామయ్య, సంతోష్‌రెడ్డి, రవికుమార్, అనంతు ఉపేందర్, షర్ఫుద్దీన్, పాగర్తి సుధాకర్, హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, మొహినుద్దీన్, మల్లేశ్, ఉదయ్, నరేశ్, వీరబాబు, సామినేని మురళి, సూరిబాబు, బాజా రామకృష్ణ, మన్నె రాధాకృష్ణ, నున్నా వెంకయ్య, మీగడ గోపి తదితరులు పాల్గొన్నారు.

కాలిపోతున్న చెట్లు


మంచుకొండ - పంగిడి మార్గంలో కాలిపోయిన చెట్లు

రఘునాథపాలెం: ఓవైపు భగభగమంటున్న ఎండ, మరోవైపు రైతులు తమ పొలాల్లోని వ్యర్థాలకు మంట పెడుతుండడంతో పచ్చని చెట్లు కాలిపోతున్నాయి. రహదారులకిరువైపులా ప్రతీ సంవత్సరం నాటుతున్న మొక్కలు ఇప్పుడు ఎదిగి నీడను ఇచ్చే స్థాయికి చేరాయి. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ, ఈర్లపుడి, రఘునాథపాలెం చింతగుర్తి, మల్లేపల్లి రోడ్డు తదితర చోట్ల రైతులు పొలాల్లో చెత్తను తగలబెతుండడంతో వడగాలులకు మంటలు ఎగిసిపడి పచ్చని చెట్లు కాలిపోతున్నాయి. చెత్త తగలబెట్టే సమయాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎంసీహెచ్ కిటకిట


ఓపీ వద్ద రద్దీ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)కు సోమవారం పెద్దసంఖ్యలో గర్భిణులు, బాలింతలు వచ్చారు. దీంతో ఎంసీహెచ్ ఆవరణ కిటకిటలాడింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో ఓపీ వద్ద భారీ క్యూలైన్ ఏర్పడగా.. మధ్యాహ్నం వరకు రద్దీ కనిపించింది. ఓపీలో పరీక్షలు చేయించుకున్నాక, వ్యాధి నిర్ధారణ పరీక్షల రిపోర్ట్ తీసుకుని మందులు తీసుకెళ్లడానికి చాలా సమయం పట్టడంతో ఉక్కపోత కారణంగా ఇబ్బందులు పడ్డారు.

వేపకుంట్లలో ఇంటింటి సర్వే


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ పీహెచ్‌సీ పరిధి వేపకుంట్ల గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర బాధితుల వివరాలు సేకరించారు. ఆ తర్వాత వైద్యశిబిరం నిర్వహించి పలువురిని పరీక్షించడమే కాక 15 మంది నుంచి రక్తనమూనాలను సేకరించారు.

నిరుపయోగంగా చార్జింగ్ మిషన్



ఖమ్మంస్పోర్ట్స్: వాహనాల చార్జింగ్ కోసం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఏడాదిన్నర కిందట ఏర్పాటు చేసిన యంత్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా దీన్ని ఏర్పాటు చేయగా.. చుట్టూ చెత్త వేయడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతోనే జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఎలక్ట్రికల్ వాహనాల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా చార్జింగ్ కోసం స్టేషన్‌లో మిషన్ ఏర్పాటుచేశారు. యంత్రం పర్యవేక్షణ తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నా.. వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటే ఉపయోగపడుతుందని ఎలక్ట్రికల్ వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధి హామీ చట్టం రక్షణకు ఉద్యమం

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు అన్నారు. మండలంలోని సదాశివాపురంలో ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పని ప్రదేశాల్లో వసతులు కల్పించడమే కాక పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

కామేపల్లి: మండలంలోని బర్లగూడెంలో ఈ నెల 24 నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు (బీపీఎల్-4) నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌లెంట్ యూత్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కాగా, సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డిని కలిసి టోర్నీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. నిర్వాహకులు కల్యాణ్, మనోజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, అశోక్, విజయ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఐపీఎల్ టోర్నీ టికెట్లు సామాన్య క్రీడాభిమానులకు దొరకకుండా చేస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్ జిల్లా కార్యదర్శులు షేక్ బషీరుద్దీన్, నలబాల రామకృష్ణ, రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నందున ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల రమేశ్, శీలం వీరబాబు, కూరపాటి శ్రీనివాస్, మంద సురేశ్, జక్కుల రవీందర్, మక్కా భరత్, గణపారపు ఉపేందర్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే కూనంనేని


నివాళులర్పిస్తున్న కూనంనేని తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 14వ డివిజన్ కొత్తగూడెంలో ఇటీవల మృతి చెందిన పగడాల భరత్ సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే భరత్ మృతి బాధాకరమని తెలిపారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కార్పొరేటర్లు చామకూరి వెంకన్న, దోరేపల్లి శ్వేత, వివిధ పార్టీల నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, బొమ్మిశెట్టి సత్యం, వి.మల్లయ్య, సంక్రాంతి నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీలో మట్టి తొలగించండి..



మండలంలోని ఊట్కూర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదు. గ్రామంలోని పాత జీపీ కార్యాలయం నుంచి ముత్యాలమ్మ తల్లి ఆలయం వరకు ఇటీవల సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించారు. ఈ క్రమంలోనే రోడ్డు, డ్రెయినేజీ మధ్య మట్టి పోయగా.. అదంతా డ్రెయినేజీలో పడింది. దీన్ని తొలగించకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలవడమే కాక ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరద రోడ్డుపైకి చేరింది. డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

-కామేపల్లి